



భక్తిపారవశ్యంలో యువతి

ముక్కోటి సంబురం... భక్తకోటి పరవశం



చేవెళ్ల వేంకటేశ్వర ఆలయంలో...

జిల్లావ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు దీరారు. దీంతో వైష్ణవ ఆలయాలు కిటకిటలాడాయి. స్వామివార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయాలు విష్ణు నామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.



ఉత్తర ద్వార దర్శనానికి బారులుదీరిన భక్తులు



చేవెళ్ల : చిలుకూరు బాలాజీ ఆలయంలో బారులుదీరిన భక్తులు



మొయినాబాద్: కనకమామిడి ఆలయంలో భక్తుల క్యూ



షాద్‌నగర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు



బాలాజీ ఆలయంలో...

ఎకరాకు రూ.2కోట్లు ఇవ్వాలి

ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు కోల్పోయే రైతుల డిమాండ్

సమావేశం నిర్వహించిన భూసేకరణ డిప్యూటీ కలెక్టర్



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఫోర్త్‌సిటీ వరకు ఏర్పాటు చేస్తున్న రోడ్డు కింద భూములు కోల్పోయే వారికి ఎకరానికి రూ.2 కోట్లు ఇవ్వాలని రాచులూరు గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు. పరిహారాన్ని తగ్గిస్తే భూములు ఇచ్చేది లేదని వారు తేల్చి చెప్పారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాచులూరు రెవెన్యూలో 90ఎకరాలు 330 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రోడ్డుకు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు నివేదికలు తయారుచేశారు. ఈ మేరకు రైతులతో సమావేశమై అధికారులు మాట్లాడారు. రాచులూరు రెవెన్యూలో ప్రభుత్వ మార్కెట్ ప్రకారం ఎకరా ధర రూ.23లక్షల 10వేలు ఉందని, దీనికి గాను రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.71లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు జోక్యం చేసుకొని.. ఈ ప్రాంతంలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, తమకు ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎకరం భూమి కోల్పోయే రైతుకు 1750గజాల ప్లాట్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేసి ఇవ్వాలని, లేదా ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, రైతులు వెదిరె రవికాంత్‌రెడ్డి(వాలీబాల్ మాజీ జాతీయ కెప్టెన్), సుభాష్‌చందర్‌రెడ్డి, వి.యాదగిరిరెడ్డి, యాదగిరి, గుయ్యని సామయ్య, కె.కుమార్, పి.మల్లయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా దర్గా ఉత్సవాలు
శంషాబాద్ డీసీపీ రాజేష్
7

హస్తవ్యస్తం!

మారని కాంగ్రెస్ నేతల తీరు



అధికార పార్టీ నాయకుల మధ్య కుదరని సయోధ్య

ఇంకా పూర్తికాని ఇందిరమ్మ కమిటీల నియామకం

ఇళ్ల మంజూరు సంక్రాంతిలోపు సాధ్యమేనా?

ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల ఎదురుచూపు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పేలా లేవు. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గందరగోళంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కమిటీల ద్వారా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సర్కార్ నిర్ణయించింది. కానీ జిల్లా నాయకుల మధ్య సయోధ్య కుదరక కమిటీల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. దీంతో సంక్రాంతి పండగ వరకు ఇళ్లు వస్తాయని ఆశ పడిన పేదలకు నిరాశే మిగిలింది.

6

రంగారెడ్డి అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఆ పార్టీ నేతల మధ్య సయోధ్య కుదరడం లేదు. నాయకుల మధ్య రోజు రోజుకూ విభేదాలు భగ్గుమంటున్నాయి. ప్రజా ప్రతినిధులు, నేతల పనితీరుపై ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నేను మారానని.. ఇక నుంచి అందరూ మారి బుద్ధిగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని" హితబోధ చేశారు. అయినా.. నేతల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించి గత ఏడాది నవంబరు 6న లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించి, 15-20వ తేదీ వరకు జాబితాను ఖరారు చేసి, ఇళ్లను మంజూరు

మిగతా 7వ పేజీలో...

నేతల మధ్య కొరవడిన సయోధ్య..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అధికార పార్టీ నేతల మధ్య సయోధ్య కొరవడింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఎంపిక ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యే లేరు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన నేతలే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. నియోజకవర్గ బాధ్యతలు వారే చూసుకుంటున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు నెలకొన్నాయి. నేతల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతోనే ఏ కార్యక్రమాలు కూడా ఆశించిన రీతిలో ముందుకుసాగడం లేదు. దీంతో ప్రభుత్వ పథకాలు ఆశించిన తీరులో ముందుకు సాగటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గోవా మద్యం పట్టివేత

వాస్కోడిగామా రైలులో తరలిస్తుండగా 49 బాటిళ్లు పట్టివేత

ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన లిక్కర్

శంషాబాద్ రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారుల దాడుల్లో 49 బాటిళ్ల గోవా మద్యం పట్టుబడింది. గోవా నుంచి హైదరాబాద్‌కు మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు వాస్కోడిగామా రైలులో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్ల ధర రూ.లక్ష ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గోవా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వాస్కోడిగామా రైలులో ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు 20 మందికిపైగా శంషాబాద్‌లో రైలు ఎక్కి సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన మద్యం బాటిళ్లకు సంబంధించి నలుగురు గుర్తుతెలియని(అన్‌నౌన్ పర్సన్స్) వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఏఈఎస్ జీవన్ కిరణ్ తెలిపారు. తనిఖీల్లో సీఐలు బాల్‌రాజ్, చంద్రశేఖర్, ఎస్సైలు రవి, వెంకటేష్, అఖిల్‌లు పాల్గొన్నారు. కాగా, మద్యాన్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ బృందాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కిషన్ అభినందించారు.

భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

» **బీఆర్ఎస్ నాయకుల ఆందోళన**

» **ఆమనగల్లులో భారీ బైక్ ర్యాలీ**




ఆమనగల్లులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు , జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిన భవనాల నిర్మాణాల పూర్తి కోసం బీఆర్ఎస్ నాయకులు కదం తొక్కారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.2.50 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, రూ.4.50 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. నిధులు విడుదల కాక వాటి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వాటిని వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. కళాశాల భవననిర్మాణ స్థలం నుంచి మార్కెట్ యార్డ్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అసంపూర్తి పనుల వద్ద బైటాయించి బీఆర్ఎస్ నాయకులు దర్నా నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చుక్క నిరంజన్ గౌడ్, శ్రీను నాయక్, సయ్యద్ ఖలీల్, కమటం వెంకటయ్య, వస్పుల సాయిలు, సురేందర్ రెడ్డి, వెంకటేశ్, రమేశ్ నాయక్, శివకుమార్, రమేశ్ నాయక్, ప్రశాంత్ నాయక్, ఈశ్వర్ నాయక్, యాదయ్య, సైదులు గౌడ్, ప్రసాద్, కిరణ్, నాగిళ్ల జగన్, గణేశ్, మహేశ్, శ్రీరాములు, కృష్ణ, యాదయ్య, శివ, దేవేందర్, గణేశ్‌నాయక్, పల్లె గిరి, కుమార్, జంగయ్య, మాల్యానాయక్, మణిపాల్, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నియామకం

మంచాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధి ఎల్లమ్మతండాకు చెందిన గుండెమోని జయమ్మ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు చేతుల మీదుగా శుక్రవారం ఆమె నియామక పత్రం అందుకున్నారు. జయమ్మ ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, మంచాల మండల పరిషత్ అధ్యక్షురాలిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించేందుకు కృషిచేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పుష్పోత్సవ్-25 హార్టికల్చర్ షో





శంషాబాద్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం మొదటి సారిగా పుష్పోత్సవ్-25 హార్టికల్చర్ షోను నిర్వహించారు. ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్ సమీపంలోని ఏరో ప్లాజా, కారు పార్కు లెవల్ దగ్గర ఈ నెల 10 నుంచి 12 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణికర్ తెలిపారు. పుష్పోత్సవ్‌ను ప్రారంభించడం ద్వారా జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. దీని ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి శాయిశక్తులా కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయమని తెలిపారు. నవాబుపేట మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ పద్మ వెంకట్‌రెడ్డి, డీఈ మాధవరెడ్డి, ఎంపీడీవో అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ గీత రాథోడ్‌సింగ్, వైస్ చైర్మన్ బలవంత్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎక్బాల్, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

ఘట్‌కేసర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా నుంచి ఆర్జీకే కాలనీ చౌరస్తా వరకు శుక్రవారం రూ.30లక్షల మున్సిపాలిటీ నిధులు, రూ.30లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మొత్తం రూ.60లక్షలతో చేపట్టిన బీటీ రెండోదశ పనులను ఆయన పరిశీలించారు. రూ.60లక్షలతో నిర్మిస్తున్న ఈరోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ చైతన్య సంపత్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

కీసర, జనవరి10(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ సమావేశాన్ని కౌన్సిలర్లు బహిష్కరించారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గతేడాది అక్టోబరులో జరిగిన సాధారణ సమావేశంలో 1వ వార్డు నుంచి 18వ వార్డు వరకు వార్డుకు రూ.30లక్షల చొప్పున అభివృద్ధి పనులు చేయుటకు గానూ రూ.5.4 కోట్లకు తీర్మానం చేశారు. శుక్రవారం సమావేశం ప్రారంభం కాగానే కమిషనర్ గతంలో చేసిన తీర్మానం మేరకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు లేవని, పనులు చేయలేమని తెలిపారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 5 గ్రామపంచాయతీలు విలీనం అయ్యాయని, గ్రామాల్లో పనులు చేసేందుకు నిధులు అవసరం ఉన్నందున ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టలేమని చైర్‌పర్సన్ తెలిపారు. దాంతో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు ఉన్నాయి కానీ, తీర్మానం చేసిన పనులకు నిధులు లేవా? అని ఆగ్రహం వ్యక్తంచేసిన కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు.

రూ.32 కోట్లతో శాశ్వత తాగునీటి పనులు

● మునిసిపల్ డీఈఈ రాకేష్‌రెడ్డి

పరిగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అమృత్-2 కింద రూ.32 కోట్ల నిధులతో శాశ్వత మంచినీటి పథకాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని మునిసిపల్ డీఈఈ రాకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరిగి మునిసిపల్ పరిధిలోని 5వ వార్డులోని తిరుమల రెసిడెన్సీలో జరుగుతున్న ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిగి మునిసిపాలిటీలో రూ.15.50 కోట్లు, వికారాబాద్‌లో రూ.12కోట్లు, కొడంగల్‌కు రూ.4.5కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, ఆయా మునిసిపాలిటీల్లో పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఒక్క పరిగి మునిసిపల్‌లోనే నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. వాటితో పాటు కొత్తకాలనీల్లో పైపులైన్లు, పాతపైపులు పాడైన ప్రాంతాల్లో పైపులైన్ నిర్మాణంతోపాటు నల్లా కనెక్షన్‌లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

అర్హులందరికీ ఎలక్ట్రిక్ స్కూటీలు ఇవ్వాలి

దౌల్తాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటీలను ఇవ్వాలని దివ్యాంగులు కోరారు. శుక్రవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. అదేవిధంగా ప్రతీ మండలానికి దివ్యాంగుల కోసం భవనాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో త్వరలోనే శిబిరం నిర్వహించి అర్హులైన గుర్తించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మద్దూర్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల దివ్యాంగులు తిమ్మారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వికారాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వానికి ఎంతగానో ఉపయోగపడుతాయని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. శుక్రవారం బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, మెమొంటోలు, మెడల్స్ అందజేశారు. విజజేతలుగా నిలిచిన టీమ్‌లకు చైర్‌పర్సన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా యువజన అధికారి అంజయ్య, అండర్-10 క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

దుద్యాల/బొంరాస్‌పేట్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని ఈర్లపల్లి, బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల, నాందర్‌పూర్, బాపల్లి తండా, రేగడిమైలారం తదితర గ్రామాల రైతులు ఆయిల్ పామ్ తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు నారాయణపేట జిల్లాలోని మరికల్, జిన్నారం గ్రామాల్లో గత ఐదు సంవత్సరాలుగా సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, రైతులు రవినాయక్, పెంటప్ప, రామునాయక్, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళన

తాండూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూ.18వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఏఎన్ఎం పోస్టులలో ప్రమోషన్ కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం వర్తింప చేయాలన్నారు.

పరిగి : ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, సీఐటీయూ ఆధ్వర్యంలో పరిగిలోని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసం ఎదుట ధర్నా నిర్వహించారు.

పరిగిలో రూ.41 కోట్లతో అభివృద్ధి పనులు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణప్రసాద్

పరిగి,జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని ఐదవవార్డులో కొడంగల్ చౌరస్తా నుంచి వెంకటేశ్వరదేవాలయం, ఇతర ప్రాంతాలకు రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం పరిగిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషితో పరిగి పట్టణ అభివృద్ధికి రూ.41 కోట్ల నిధులు వచ్చాయని తెలిపారు. మొదటగా రెండు కోట్లతో వెంకటేశ్వదేవాలయం వరకు రోడ్లు, సీసీ ఫ్లాట్‌ఫామ్‌ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. పరిగిలోని శాశ్వత తాగునీటి సమస్య తీర్చడానికి రూ.16 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. పరిగి-షాద్‌నగర్, పరిగి-వికారాబాద్‌ల వరకు నాలుగు లైన్‌ల రోడ్ల నిర్మాణాల కోసం సీఎంను ఒప్పించి రూ.340 కోట్ల మంజూరి చేయించారని చెప్పారు. గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వరకు రూ.100 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు టెండర్ పిలువడం జరిగిందని తెలిపారు.




హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."




పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ప్లాట్ల కేటాయింపు

యాచారం , జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీకి భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, నానక్‌నగర్, మేడిపల్లి, తాటిపత్రి గ్రామాల పరిధిలోని రైతులకు ప్లాట్ల కేటాయింపు జాబితాను శుక్రవారం ఆయా పంచాయతీల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. అందులోని పేర్లను రైతులు చెక్ చేసుకున్నారు. అన్ని పంచాయతీల నోటీసు బోర్డులపై ప్లాట్ల కేటాయింపు జాబితాను ఉంచినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి తెలిపారు. వాటిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం లబ్ధిదారులకు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి అందించడం జరుగుతుందని ఆర్డీవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మా భూములివ్వం

ఆదిభట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ వరకు ఏర్పాటు చేసే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం భూములు ఇవ్వబోమని ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో రైతులు తేల్చి చెప్పారు. శుక్రవారం కొంగరకలాన్‌లో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, భూసేకరణ అధికారులు వినయ్‌కుమార్, తారకేశ్వర్‌రెడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ రెవెన్యూ పరిధిలో 61 ఎకరాల భూసేకరణకు ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇక్కడి భూములు కోట్ల రూపాయలు పలుకుతుంటే.. లక్షల్లో పరిహారం ఇవ్వడం తగదన్నారు. పట్టా భూముల జోలికి వస్తే ప్రాణాలు తీసుకోవడానికైనా వెనకాడమంటూ రైతులు హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన వినతులను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పుష్పలత, కొంగరకలాన్ రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మహిళను దూషించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి వై. గీత మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ క్లబ్‌లో దళిత సంఘాల నాయకులు, బాధితులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. వరమ్మకు న్యాయం చేయాలని, ప్రత్యర్థుల నుంచి ఆమెకు రక్షణ కల్పించాలన్నారు. లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనసూయ, మల్కయ్య, మహిపాల్, మహేందర్, మల్లేశ్, రాములు, గోపాల్, ప్రభాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా దర్గా ఉత్సవాలు

» శంషాబాద్ డీసీపీ రాజేష్



జేపీ దర్గా పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్

కొత్తూర్, జనవరి10 (ఆంధ్రజ్యోతి) : హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ స్థానిక వక్ఫ్‌బోర్డు అధికారులకు సూచించారు. ఈనెల 16నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం దర్గా పరిసరాలను డీసీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ తేదీన గంధోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దర్గా ఆవరణలో బారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతిలో భక్తులకు దర్గా దర్శనం కల్పించాలన్నారు. పోలీసులు సూచించిన స్థలాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. దర్గా పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మారావు, ఎస్ఐలు శ్రీనివాస్, మురళీగౌడ్, దర్గా సూపరింటెండెంట్ సత్తార్ పాల్గొన్నారు.

హస్తవ్యస్తం!

(ఐదో పేజీ తరువాయి)

చేస్తామని ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. కానీ అడుగు ముందుకు పడటం లేదు. ఈ పథకం కింద తొలి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి రూ. 5 లక్షలు, రెండో విడతలో స్థలం లేని వారికి స్థలమిచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించారు.

కమిటీలు ఇంకెప్పుడు?

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఉమ్మడి జిల్లాలో ఈ ప్రక్రియ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. సంక్రాంతిలోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై అర్హుల కోసం అధికారులు చేపట్టిన సర్వే ఇంకా పూర్తి కాలేదు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన కోసం ప్రారంభించిన సర్వే జిల్లాలో ఇంకా కొనసాగుతోంది. సర్వే పూర్తయిన తరువాత ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక చేయాల్సి ఉంటుంది. గ్రామాలు, మున్సిపాలిటీల్లో లబ్ధిదారుల ఎంపికను ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలని దాదాపు మూడు నెలల క్రితం ప్రభుత్వం నిర్ణయించింది. సర్కార్ సూచనల మేరకు కమిటీ సభ్యులను ఎంపిక చేసి ఆయా జిల్లాల కలెక్టర్‌ల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది. దానికి మంత్రి ఆమోదం తెలుపుతారు. అయితే దాదాపు మూడు నెలలుగా ప్రతిపాదనల కోసం కమిటీల ఎంపిక కొనసాగుతూనే ఉంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఇసుక తరలింపులో ఇష్టారాజ్యం

» అనుమతి వేరేచోట.. డంప్ మరోచోట

» పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్న కాంట్రాక్టర్



తాండూరు మండలం సాయిపూర్ ప్రాంతంలో ఓ ఇంటి నిర్మాణం వద్ద ఇసుక డంపింగ్

తాండూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అనుమతి పొంది.. ఇసుకను ఇష్టారాజ్యంగా తరలించి అనుమతులు ఉన్నచోట డంప్ చేయాల్సి ఉండగా.. కొందరు కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణాల వద్ద డంప్ చేసి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. పర్మిట్ తీసుకొని ఇష్టారీతిన వ్యాపారం సాగిస్తున్నారు. తాండూరు మండల పరిధిలోని కాగ్నా నది నుంచి బంట్వారం మండలం బొపునారంలో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఓ కాంట్రాక్టర్ ఈనెల 10, 15, 16వ తేదీల్లో ఇసుక తరలించేందుకు తాండూరు తహసీల్దార్ ద్వారా రోజుకు పది ట్రిప్పుల లెక్కన 30 ట్రాక్టర్ల ఇసుక తరలించేందుకు అనుమతులు పొందారు. అయితే, కాగ్నా నది నుంచి ఇసుకను తీసుకెళుతున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షించకపోవడంతో బొపునారంలో సీసీ రోడ్డు పనులు జరుగుతున్న ప్రదేశంలో ఇసుకను వేయాల్సి ఉండగా.. తాండూరు పట్టణ పరిధిలోని ఓ ఇంటి నిర్మాణం ఎదుట డంప్ చేశారు. తాండూరు పట్టణ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ పోలీసుల కళ్లుగప్పి తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, టాస్క్‌ఫోర్స్, మైన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమ ఇసుక తరలింపును కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలని, ట్రాక్టర్లను పరిశీలించి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మా వాహనానికే దారివ్వరా?

అధికార పార్టీ నాయకుల హంగామా!


పరిగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మా వాహనానికే దారివ్వరా? అంటూ అధికార పార్టీ నాయకులు నడిరోడ్డుపై హంగామా సృష్టించారు. సముదాయించేందుకు యత్నించిన వారిపై చిర్రుబుర్రుమన్నారు. ఆనక వారిని బూతులు తిట్టారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా దోమ పీఏసీఎస్ చైర్మన్ ఎ.యాదవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శాంతకుమార్‌లు కారులో గురువారం సాయంత్రం పరిగి శివారులోని రోడ్డుపై వెళుతున్నారు. ఈక్రమంలో అదే రోడ్డుపై వెళుతున్న వాహనాలు కారుకు సైడ్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో వారు కారును నడిరోడ్డుపై నిలిపి కోపంతో బయటకు వచ్చారు. తమ వాహనానికే సైడ్ ఇవ్వరా? అంటూ రెచ్చిపోయారు. పాల ట్యాంకర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్, ఇతర వాహనదారులపై విరుచుకుపడ్డారు. మా కారుకే సైడ్ ఇవ్వరా? ఎవరు వస్తారో రానివ్వు అంటూ ఊగిపోయారు. ఈక్రమంలో రోడ్డుకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌జామ్ అయ్యింది. అయినా వారు ఏమాత్రం బాధ్యత, భయం లేకుండా రోడ్డుపైనే కారును నిలుపుతాం.. ఏం పీక్కుంటారో.. పీక్కోండని బూతుపురాణం మొదలెట్టారు. ఈ క్రమంలో అక్కడున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారులతో పాటు ఆర్టీసీ బస్సులో ఉన్న ప్రయాణికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ తతంగం అంతా కొందరు సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా.. సోషల్ మీడియాలో వైరలైంది. ఆ నాయకుల వ్యవహార శైలి చూసి కొందరు ఇదేంటి! అధికార పార్టీ నాయకులైతే మాత్రం ఇలానే చేస్తారా అని విస్మయం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

పరిగి,జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని పరిగి డీఎస్పీ నేతి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పరిగిలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్లోబల్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పరిగి ఎంపీఐ వీరేంద్రనాయక్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్, కళాశాల ప్రిన్సిపాల్ ముజీబ్ పాల్గొన్నారు.

ఏకేఆర్ స్టడీసర్కిల్ సేవలు అభినందనీయం

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

వికారాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఏకేఆర్ స్టడీ సర్కిల్ సేవలు అభినందనీయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో ఏకేఆర్ స్టడీ సర్కిల్ 2025 డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ, కానిస్టేబుల్, గ్రూప్ 4, గురుకుల పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏకేఆర్ స్టడీ సర్కిల్ అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర డివిజన్ ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి తిరిగి బదిలీపై రావడం అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంకట ఉపేందర్‌రెడ్డి బదిలీ అయిన రెండు నెలల్లోనే తిరిగి అదే స్థానంలోకి రావడం.. తెరవెనుక ప్రభుత్వంలో కీలక నేతకు అత్యంత సన్నిహితుడు చక్రం తిప్పినట్లు అధికారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2024 అక్టోబరు 28న వెంకట ఉపేందర్‌రెడ్డి కీసర డివిజన్ నుంచి సిరిసిల్లకు బదిలీపై వెళ్లారు. మేడ్చల్ జిల్లా భూసేకరణ విభాగం అధికారి సైదులు కీసర డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. తిరిగి సైదులును సిరిసిల్లకు బదిలీ చేయగా, సిరిసిల్ల నుంచి వెంకట ఉపేందర్‌రెడ్డి కీసరకు బదిలీపై వచ్చారు. దీనివెనుక ప్రభుత్వంలోని ఓ కీలక నేతకు అత్యంత సన్నిహితుడు చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. రెండు నెలల్లోనే తనను బదిలీ చేయడంపై కీసర ఆర్డీవో సైదులు తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు కూడా కిమ్మనకుండా ఉండటం గమనార్హం. వెంకట ఉపేందర్‌రెడ్డి గతంలో కీసర తహసీల్దార్‌గా కూడా పనిచేశారు.

మాట తప్పిన సీఎం..

» మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డిని చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుందని, ఇచ్చిన మాట తప్పిన సీఎం అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి తాను సీఎంగా ఉన్నంత కాలం సినిమాలకు ఎక్స్‌ట్రా ప్రివిలేజెస్ ఉండవని.. టికెట్ రేట్లు పెంచమని ప్రకటించి నెలరోజులు కూడా కాక ముందే మాట మార్చేశాడని అన్నారు. రెండు రెండే దొందు దొందే అన్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బెనిఫిట్ షోలు, అడిషనల్ షోలు ఉండవని, టికెట్ రేట్లు పెంచమని అసెంబ్లీలోనే ప్రకటించిన మాటలను గాలికొదిలేసి తాజాగా తెలంగాణలో గేమ్‌ఛేంజర్ సినిమాకి టికెట్ రేట్లు పెంచుతూ అడిషనల్ షోలకు పర్మిషన్ ఇస్తూ జీవో జారీ చేయడం ఏంటని, మాట నిలబెట్టుకోలేని తనానికి ఇది నిదర్శనమన్నారు. ప్రజాక్షేమం దృష్ట్యా బెనిఫిట్ షోలు ఉండవని తేల్చిచెప్పిన సీఎం, మంత్రి ఆరు షోలకు అనుమతి ఇస్తూ జీవో ఇవ్వటం వెనుక ప్రజాశ్రేయస్సుకి మించి ఇంకే ఉందో వారే సమాధానం చెప్పి తీరాలన్నారు.

వైకుంఠ దర్శనం.. భక్తి పారవశ్యం

శోభాయమానంగా ఆలయాలు ముస్తాబు
ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు


షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పల్లకీ సేవ


మొయినాబాద్: కనకమామిడి ఆలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


తిరుపతిలో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

మొయినాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని వేంకటేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయం గోవిందనామస్మరణతో మార్మోగింది. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకున్నారు.

చౌదరిగూడలో..

చౌదరిగూడ: జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

శంషాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు వివిధ బస్తీల్లో ఉన్న ఆలయాల్లో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శోభాయమానంగా ఆలయాలు

ఆమనగల్లు: వైకుంఠ ఏకాదశిని ఆలయాలు శోభాయమానంగా వెలుగొందాయి. ఆమనగల్లు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు.

కడ్తాల్: కడ్తాల లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

తలకొండపల్లి: దేవునిపడకల్ వేంకటేశ్వర ఆలయంలో అర్చకుడు రామానుజాచార్యులు, పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ముక్కోటి దర్శనం

చేవెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ బాలాజీ వేంకటేస్వార దేవాలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉదయన్నే స్వామివారిని దర్శించుకున్నారు.

షాబాద్‌లో..

షాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేంకటేశ్వరాలయాలు భక్తులతో సందడిగా మారాయి. షాబాద్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

మొయినాబాద్ రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. రద్దీ దృష్ట్యా ప్రదక్షిణలు నిలిపివేశారు. స్వామివారిని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారని అర్చకులు రంగరాజన్ తెలిపారు. స్వామివారిని ఎమ్మెల్యే యాదయ్య దర్శించుకున్నారు.

కందుకూరు: కందుకూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వారిని అంగరంగవైభవంగా అలంకరించారు. పులిమామిడి, కొత్తగూడ, దెబ్బడగూడ, నేదునూరు, ముచ్చర్ల, రాచులూరు తిమ్మాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

మహేశ్వరం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తుక్కుగూడ వేంకటేశ్వరాలయంలో స్వామివారిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు.

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఏసీపీ రంగస్వామి నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు కల్పించారు. స్వామిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డీఓ సరిత, ఏసీపీ రంగస్వామి, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య తదితరులు దర్శించుకున్నారు.

కొత్తూర్: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

యాచారం: యాచారం వేంకట్వేరాలయంలో బీజేపీ నాయకుడు, ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, తక్కళ్లపల్లిలోని వేంకటేశ్వరాలయంలో యాచారం సీఐ నర్సింహారావు పూజలు చేశారు.

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ప్రముఖ అధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి అధ్వర్యంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

కేశంపేట: మండలంలో ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని ఆలయాల్లో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.


చేవెళ్ల: ఎమ్మెల్యే యాదయ్య పూజలు


కడ్తాల: మక్తమాదారంలో..


తుక్కుగూడ వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


శంషాబాద్‌రూరల్: అమ్మపల్లి ఆలయంలో భక్తుల పూజలు

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

చేవెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చనువల్లి అనుబంధ గ్రామం ఇక్కరెడ్డిగూడ గ్రామానికి చెందిన సత్తమ్మ(45) భార్త పదేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పిల్లలు లేకపోవడంతో ఆమె తల్లిగారి ఇంటికి వద్దనే ఉంటుంది. ఒంటరిగా ఉండడంతో మనస్థాపం చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిని హత్య చేసిన అత్త రిమాండ్

శంషాబాద్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కోడలిని హత్య చేసిన అత్తను రిమాండ్‌కు తరలించిన ఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామంజాపూర్ తండాకు చెందిన ముడావత్ సురేష్ భార్య ముడావత్ దూలి (38)ని అత్త ముడావత్ తులసి రెండు నెలల క్రితం సాతంరాయిలోని ఒక ప్రయివేట్ వెంచర్‌లో కల్లులో గులుకల మందు కలిపి తాగించి హత్య చేసి మట్టిలో పాతిపెట్టిన సంగతి తెల్సిందే. గత కొంత కాలంగా అత్తా, కోడలు మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత నవంబర్‌లో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. ఈ నెల 9న దూలి చిన్న కొడుకు తన తండ్రితో ఆరోజు నాన్నామ్మ, అమ్మ ఇద్దరు కలిసి బయటకు వెళ్లారు. కాని, తిరిగి నానామ్మ ఒక్కతే వచ్చిందని తండ్రి సురేష్‌కు చెప్పాడు. అనుమానం వచ్చిన సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకుంది. రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో అత్యుత్తమ క్రీడా పాలసీ

టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి


బహుమతులు ప్రదానం చేస్తున్న టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, సినీ నటుడు ప్రభాస్ శ్రీను

కడ్తాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి అత్యుత్తమ క్రీడాపాలసీ రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టినట్లు టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలోని పార్చ్యాన్ బట్టర్‌ఫ్లై సిటీ పాఠశాల మైదానంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి నారాయణ రెడ్డి స్మారకార్థం తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న కడ్తాల ప్రీమియర్ లీగ్-3 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి చల్లా నర్సింహారెడ్డి, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ, సినీ నటుడు ప్రభాస్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, బట్టర్‌ఫ్లై సిటీ డైరెక్టర్ రమేశ్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దివంగత గూడూరు నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలలో విన్నర్‌గా నిలిచిన కడ్తాల్ ఈగల్స్ టీంకు మొదటి బహుమతి రూ.30,116, రన్నర్‌గా నిలిచిన కడ్తాల్ స్పాటర్స్ టీంకు రెండో బహుమతి రూ.20,116లతో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీలు గురిగళ్ల లక్ష్మయ్య, పాలకుర్ల రాములు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కడ్తాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసం, శారీర ధారుడ్యానికి దోహదపడుతాయని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. కడ్తాల మండలం సాలార్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ ప్రియరమేశ్ , మాజీ ఎంపీపీ పంతూనాయక్‌తో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పంతూ, సాయిలు, బాబా, జంగయ్య, కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో కీర్తి

కడ్తాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే కీర్తి లభిస్తుందని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. సామాజిక సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట శుక్రవారం లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సందడి నరేందర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్‌లతో కలిసి ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ రాష్ట్ర వ్యాప్తంగా మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామీణ క్లబ్‌లలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సేవల్లో అగ్రభాగాన నిలువడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, సభ్యులు రాజేందర్ యాదవ్, తరుణ్, రమేశ్, శ్రీనివాస్, రాజు, అంజయ్య, పీఆర్‌వో పాషా ఉన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

కందుకూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందని మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు.పోటీల్లో పది టీమ్‌లు పాల్గొన్నాయని, గెలుపొందిన టీమ్‌కు మొదటి బహుమతిగా రూ.25వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ద్వితీయ బహుమతి కింద రూ.15 వేలు మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు ఇవ్వడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సురసాని విఠల్‌రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, బి.ప్రశాంత్‌కుమార్, ఎగ్గిడి జగదీశ్, పి.శ్రీశైలం, ఎండీ మొహినుద్దీన్, ఎద్ల ఉదయ్‌కిరణ్, గుండ్ర అనీల్ రెడ్డి, రాజశేఖర్, వెంకట్. సచిన్, ఆర్గనైజర్లు పి.రాజశేఖర్, నందు, శ్రీకాంత్, సిద్దు పాల్గొన్నారు.

స్కాన్ చేసి... అభిప్రాయం చెప్పండి

కేశంపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెప్పవచ్చని కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కేశంపేట పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ లెన్స్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఇంగ్లిషు, తెలుగులో పేజీ తెరుచుకుంటుందని తెలిపారు. పోలీసుల గురించి ప్రశ్నలు ఉంటాయని, వాటికి సమాధానాలు పంపాలని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వార ఎఫ్ఐఆర్, పాస్‌పోర్టు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, ధృవీకరణ ఇతర అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజల అభిప్రాయలు విశ్లేషించి పోలీస్‌స్టేషన్‌లకు ర్యాంకు ఇస్తారని వివరించారు. పోలీసుల పని తీరు మెరుగుపర్చడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, పీసీలు రమాదేవి, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా ఫోర్త్ సిటీ

మహేశ్వరం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఫోర్త్ సిటీ పర్యావరణ సమతుల్యతను కాపాడేలా నిర్మితమవుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుతున్న అభివృద్ధి పనులు దేశానికే తలమానికంగా నిలుస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 330 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూసేకరణ చేయనున్నాట్లు పేర్కొన్నారు. ధరణితో ఎన్నో కష్టాలు చవి చూశామని, భూ భారతితో అన్ని కష్టాలు దూరమవుతున్నాయన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు ఫోర్త్ సిటీకి క్యూ కడుతున్నాయని చెప్పారు. ఫోర్త్ సిటీ అభివృద్ధికి రూ.4 వేల కోట్లు విడుదలయ్యాయన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని విపక్షాలు ఫార్మా పరిశ్రమలు వస్తాయని చేస్తున్న ఆరోపనల్లో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అభివృద్ధికి సహకరిస్తే బాగుంటుందన్నారు.

తాటిచెట్లు నరికితే చర్యలు

కడ్తాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తాటి చెట్లను నరికితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. కడ్తాల మండలం చరికొండలో గీత కార్మికులకు జీవనోపాధిగా నిలిచిన తాటి చెట్లను కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా కొట్టివేశారు. సమాచారం అందుకున్న సీఐ శుక్రవారం ఆ చెట్లను పరిశీలించారు. సుమారు 70 తాటి చెట్లను తొలిగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా తాటి చెట్లను తొలిగించిన నక్కెర గోపాల్, బుగ్గ రాములు, కొత్త శ్రీరాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కందుకూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలండర్‌ను శుక్రవారం మండల శాఖ అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ, కందుకూరు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, సంఘం జిల్లా కార్యదర్శి భువనేశ్వరి, మండల శాఖ నాయకులు డిక్టర్ జె.బుగ్గరాములు, ఈశ్వర్, కుమార్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి రుణమాఫీ చేయాలి

ఇబ్రహీంపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల లోపు ఉన్న రైతుల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయడంతోపాటు రైతుబంధు ఖాతాల్లో జమచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముత్యాల భాస్కర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడి డిమాండ్ చేశారు. శుక్రవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దారు సునీతారెడ్డికి వినతిపత్రమందజేశారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


రావిర్యాలలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో ఆర్‌పీఎల్ ప్రీమియర్ లీగ్ సీజన్ -4 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లకు నీరందిస్తున్న పంచాయతీ కార్మికులను పలకరించారు. పక్కనే రైతు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల పార్టీ అధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజ్, గోపాల్, శివకుమార్, చంద్రశేఖర్, పురుషోత్తంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ వెంకటనరసింహారెడ్డి, నర్సింహులు, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి


ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు .

ఇబ్రహీంపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేలు వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ పిలుపమేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశాలు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో క్యాంపు కార్యాలయం గేటుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా గ్రామాల్లో సేవలందిస్తున్న ఆశా వర్కర్లు కనీస వేతనంలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతోపాటు రూ.50 లక్షల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు బుగ్గ రాములు, చందునాయక్, ఎల్లేశ్, యాదగిరి, మునెమ్మ, సుకన్య, లావణ్య పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు , జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ఆశా కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు అంజనేయులు, పెంటయ్య తెలిపారు.

సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ

చేవెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండల పరిధిలోని ఆలూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భరత్‌కుమార్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్స్ మోడలింగ్‌లో యాంటి హ్యాకింగ్ కోడ్ ప్రాజెక్టును డెవలప్ చేసే విధానంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలా రాణి, గైడ్ టీచర్ అమర్ చంద్, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

మహేశ్వరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ హేమలతారాజు అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపల్‌లోని 9వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాదుకు అతి చేరువలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీలో ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

భూ భారతితో శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ యాట గీతానర్సింహ

ఆమనగల్లు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతులకు భూ సమస్యలు ఉండవని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాభివృద్ది , పేదల శ్రేయస్సు , సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. సమావేశంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్‌రాజ్, దర్మనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ ఉన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

కడ్తాల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తమాదారం గ్రామంలో శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మకు పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనూరమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అబినందన కార్యక్రమం నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, చెన్నయ్య, బాల్‌రాజ్, మల్లేశ్, జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేస్తాం

చేవెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలకు ఆకర్షితులై గ్రామీణ ప్రాంతంలోని యువత భారీగా బీజేపీలోకి వస్తున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామన్నగూడ గ్రామంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పెద్దోళ్ల దయాకర్‌తో పాటు మరో 100 మంది చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమాణారెడ్డిల సమక్షంలో కాశాయ కండువా కప్పుకున్నారు.

ఘనంగా దర్గా ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి తులేకలాన్ గ్రామంలో మదర్‌సావుల ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచులు చిలుకల బుగ్గరాములు, బీరప్ప, యాదగిరి, మాజీ ఎంపీటీసీ నాగమణి. ఫ్యాక్స్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.25 కోట్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల నుంచి మంగల్‌పల్లి వరకు రహదారి విస్తరణకు ఆర్అండ్‌బీ నుంచి రూ.25 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఎండీఆర్ ప్లాన్ కింద 3 కిలోమీటర్లు 250 మీటర్ల పొడవునా ఈ రహదారి విస్తరణ, అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

ఎమ్మెల్సీ కవితకు సత్కారం



తలకొండపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ శుక్రవారం ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ద్వారా విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలను కవితకు వివరించారు.

స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకం

ఆమనగలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ అమనగల్ రాజు అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సామాజిక తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించి నివాళులర్పించారు.

బీజేపీ నూతన అధ్యక్షుల నియామకం

ఆమనగలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆమనగల్లు మున్సిపాలిటీ, మండల నూతన అధ్యక్షులుగా కర్నాటి విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీను నియమితులైయ్యారు. మర్రోజుపల్లి గ్రామానికి చెందిన కౌన్సిలర్ విక్రమ్‌రెడ్డిని మున్సిపాలిటీ అధ్యక్షుడిగా, మంగళపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్లు శ్రీనును మండల అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడాకారులకు ప్రపంచ గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని గొప్ప క్రీడాకారులుగా ఎదిగితే ప్రపంచ గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ నాయకుడు కబీర్ సహకారంతో ఎమ్మెల్యే క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

షాద్‌నగర్‌రూరల్, జనవరి10(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్(రోడ్డు సేఫ్టీ) ఎల్‌సీ నాయక్ సూచించారు. రోడ్డు భద్రతావారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ట్యాక్సీ డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. దూర ప్రయాణాలు చేసేటప్పుడు విధిగా నిబంధనలు పాటించాలని కోరారు.